## పార్కింగ్ స్థలాలెక్కడ..?



2

## పరిహారం కోసం టవర్ ఎక్కిన బాధితుడు



2

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## రేపటితో ముగియనున్న ప్రచార పర్వం

**అక్షరటుడే, ఇందూరు:** గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్‌ను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని ప్రచారం నిషేధిస్తున్నట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. మొదటి విడతలో ఎన్నికలు జరుగనున్న మండలాల్లో ఈనెల 9న సాయంత్రం 5 గంటల నుంచి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందన్నారు. ఎన్నికలు ముగిసే వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు. పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి ఎన్నికలు ముగిసే వరకు ఆయా మండలాల్లో మద్యం షాపులను, కల్లు దుకాణాలను మూసివేయాలని కలెక్టర్ ఆదేశించారు.






## పోలీస్ ప్రజావాణికి 24 ఫిర్యాదులు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ ప్రజావాణిలో 24 ఫిర్యాదులు స్వీకరించినట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లుగా పేర్కొన్నారు. పోలీస్ ప్రజావాణిలో ప్రజలు నిర్భయంగా తమ సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు చేయవచ్చని సీపీ తెలిపారు. ఆ అర్జీలను చట్టపరంగా పరిష్కరించే విధంగా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా ప్రజలు పోలీసు సేవల్ని వినియోగించుకోవచ్చన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని ప్రజలు లిక్కర్, అధిక మొత్తంలో డబ్బులు తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



## కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించండి: ఎమ్మెల్యే

**అక్షరటుడే,కోటగిరి :** గ్రామాల్లో అభివృద్ధి కోసం కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించాలని ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కోరారు. పోతంగల్ సర్పంచ్ అభ్యర్థి గంధపు చైతన్య పవన్ కుమార్‌కు మద్దతుగా సోమవారం ఆయన గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ స్థలాలను సర్వే చేయించి ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు నిర్మాణాలు చేయించి ఇస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి గంధపు చైతన్య పవన్ కుమార్‌ను గెలిపించాలన్నారు. మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్, ఉప్పల శంకర్, కేశ వీరేశం, వర్ని శంకర్, గంట్ల విఠల్, నబీ, మాణిక్ అప్పా, జుమ్మా ఖన్, రాజు,దత్తు, గంగులు, గంగాధర్ పాల్గొన్నారు.



## ఘనంగా అంక్సాపూర్ సంతమల్లన్న జాతర

**అక్షరటుడే, ఆర్మూర్:** వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలో సంతమల్లన్న జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మల్లన్న స్వామిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే మల్లన్న స్వామిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# వరాల జల్లు




▸ పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థుల మేనిఫెస్టో ▸ గెలిస్తే పలు పనులు చేస్తామని హామీ ▸ బాండ్ పేపర్ రాసిస్తున్న పలువురు ▸ అసెంబ్లీ ఎన్నికలను తలపిస్తున్న సర్పంచ్ ఎన్నికలు

**గ్రామ పంచాయతీ ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికలను తలపిస్తున్నాయి. ఎలాగైనా గెలవాలనే కసితో ఉన్న పలువురు అభ్యర్థులు ఎంత ఖర్చుకైనా వెనుకాడటం లేదు. ప్రజలపై వరాల జల్లు కురిపిస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రత్యేకంగా గ్రామ మేనిఫెస్టోలు తయారు చేస్తున్నారు. అలవికాని హామీలు ఇస్తూ గెలిచేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. దాంతో పల్లెపోరు రసవత్తరంగా మారింది.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. ఎన్నికలు నువ్వా నేనా అన్నట్టు సాగుతున్నాయి. గ్రామాల్లో ఇప్పటికే అభ్యర్థులు సర్పంచ్‌గా పోటీ చేసేందుకు నామినేషన్లు దాఖలు చేశారు. చాలా గ్రామాల్లో పోటీ తీవ్రంగా ఉండనున్నట్లు సమాచారం. దీంతో కొంతమంది అభ్యర్థులు ఎలాగైనా గెలవాలని పట్టుదలతో ముందుకు వెళ్తున్నారు. గెలుపు కోసం రకరకాల ప్రయోగాలు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల మాదిరిగా ప్రత్యేకంగా గ్రామ మేనిఫెస్టోలు తయారు చేస్తున్నారు. ఓటేసి గెలిపిస్తే ఫలానా పనులు చేస్తామని హామీలిస్తున్నారు.

### బాండ్ పేపర్ రాసిచ్చి..

ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని ఓటర్లను నమ్మించేందుకు అభ్యర్థులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మేనిఫెస్టోను బాండ్ పేపర్ రూపంలో రాసివ్వడానికి సైతం వెనుకాడటం లేదు. గతంలో పలు చోట్ల అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో కొనసాగిన బాండ్ పేపర్ రాజకీయాలు ప్రస్తుతం గ్రామాలకు పాకాయన్న ప్రచారం సాగుతోంది. తాము గెలిస్తే ఎలాంటి అక్రమాలకు పాల్పడబోమని అభ్యర్థులు పేర్కొంటున్నారు. ఈ మేరకు ప్రస్తుతం తమకు ఉన్న ఆస్తుల వివరాలను సైతం వెల్లడిస్తున్నారు.

### రూ.కోటి ఖర్చయినా ఓకే..

ప్రస్తుతం గ్రామ పంచాయతీల పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రభుత్వాల నుంచి నిధులు రాక పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి పాలనను నెట్టుకొస్తున్నారు. గతంలో పని చేసిన సర్పంచులు రూ.లక్షల్లో అప్పుల పాలయ్యారు. వారికి ఇప్పటికి నిధులు రాలేదు. దాంతో అనేక చోట్ల పాత సర్పంచులు పోటీకి వెనుకంజ వేశారు. మరికొందరు మాత్రం పోటీలో ఉన్నారు. అయినా కానీ కొత్తగా పోటీ చేసే అభ్యర్థుల పలు చోట్ల ఖర్చుకు వెనుకాడటం లేదని తెలుస్తోంది. మేజర్ పంచాయతీలు, కమర్షియల్ పంచాయతీలలో రూ.కోటికి పైగా ఖర్చు చేసేందుకు కూడా ఆలోచించడం లేదన్న టాక్ వినిపిస్తోంది. ఇక్కడ డబ్బులు ముఖ్యం కాదని, గెలిచామా లేదా అన్నదే ముఖ్యమని చెప్పుకుంటున్నారు. అయితే ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారోనని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

### బెడిసి కొడితే అంతే సంగతి

జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ సారి చాలా మంది తొలిసారి బరిలో నిలిచారు. ఏమాత్రం రాజకీయ అవగాహన లేని వారు సైతం తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు. అయితే చిన్న గ్రామంలో అయినా సర్పంచ్ అభ్యర్థి కనీసం రూ.10 లక్షలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితులు ఉన్నాయి. దీంతో అభ్యర్థులు అప్పులు చేస్తున్నారు. అయితే ఎన్నికల్లో ఖర్చు పెట్టి గెలవకుండా బెడిసికొడితే మాత్రం ఆ అభ్యర్థి సంగతి అంతే అనే ప్రచారం సాగుతోంది. దాంతో ఖర్చు విషయంలో ఆలోచించాలని పలువురు సూచిస్తున్నారు.

## కాంగ్రెస్‌లో పలువురి చేరిక




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని సోమార్‌పేట గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాగుల సాయిలు, యూత్ నాయకులు లక్ష్మీనారాయణ, గ్రామ మహిళలు సుమారు 80మంది కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ప్రజలు,కార్యకర్తలు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు సంక్షేమ పథకాలు అందేవిధంగా కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కుర్మ సాయిబాబా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.




## రేపు కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

**అక్షరటుడే, కామారెడ్డి:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటయ్యాక గత ప్రభుత్వ హయాంలో ఉన్న తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చేసింది. నూతన తెలంగాణ తల్లి విగ్రహ నమూనాను ప్రభుత్వం తయారు చేసింది. అయితే రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం నిధులను కూడా కేటాయించగా కామారెడ్డి కలెక్టరేట్‌లో గత కొద్దిరోజులుగా తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగాయి. కార్యాలయ ఆవరణలో పనులు పూర్తి చేసి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే మంగళవారం సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ అధికారికంగా చేపట్టనున్నారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.



## 24న ఎస్సారెస్పీ నుంచి కాలువలకు నీటి విడుదల

**అక్షరటుడే, బాల్కొండ:** ఎస్సారెస్పీ నుంచి కాలువలకు నీటివిడుదలకు ప్రణాళిక రూపొందించినట్లు ప్రాజెక్ట్ ఎస్ఈ జగదీష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. కమిటీ నిర్ణయించిన ప్రకారం.. ఈనెల 24న శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాకతీయ, సరస్వతి, లక్ష్మీ కాలువలకు యాసంగి సీజన్‌కు నీటిని విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆయకట్టుకు వారాబంది పద్ధతిలో సాగునీటి విడుదల కొనసాగుతుందని పేర్కొన్నారు. సాగునీరు వృథా కాకుండా పొదుపుగా వాడుకొని సహకరించాలని రైతులకు ఆయన విజ్ఞప్తి చేశారు.



## ప్రతిపైసా నియోజకవర్గ అభివృద్ధి కోసమే : ఎమ్మెల్యే

**అక్షరటుడే, ఇందూరు:** వచ్చిన ప్రతి పైసా నియోజకవర్గ అభివృద్ధి కోసం వెచ్చిస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత రెండేళ్లలో సుమారు రూ.130 కోట్ల నిధులు తీసుకురావడంలో తాను విజయం సాధించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టులను పూర్తి చేయడానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను సీఎంకు నిరంతరం లేఖలు రాయడం.. అసెంబ్లీలో డిమాండ్ చేయడం ద్వారా నిధులను సాధించినట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు అవినీతి లేకుండా నియోజకవర్గ అభివృద్ధి కోసం మాత్రమే ఖర్చు పెడతారని హామీ ఇస్తున్నానన్నారు. ప్రజలకు సేవ చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని పేర్కొన్నారు. ప్రతి డివిజన్ అభివృద్ధి కోసం రూ.కోటి చొప్పున నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. ప్రభుత్వ ప్రత్యేక నిధుల కోసం తాను డిమాండ్ చేసిన రూ.100 కోట్ల ఎస్టిమేషన్లో, ప్రభుత్వం గత నెలలో రూ.37 కోట్లు విడుదల చేసిందని గుర్తు చేశారు. నుడా ద్వారా అభివృద్ధి పనుల కోసం రూ.23 కోట్లు, ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి రూ.2.76 కోట్లు, డబుల్ బెడ్ రూమ్‌ల మరమ్మతు కోసం రూ1.25 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. అలాగే ప్రగతినగర్ శ్మశాన వాటిక కోసం రూ.3.8 కోట్లు, ఎల్లమ్మ గుట్ట సోనీ ఫంక్షన్ హాల్ దగ్గర 8 ఏళ్లుగా నిలిచిన బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.6 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు వివరించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, జ్యోతి వీరేందర్, మాస్టర్ శంకర్, ఆనంద్ రావు, నాగరాజు, ఇప్పకాయల కిషోర్ పాల్గొన్నారు.

## ఎన్నికలకు వేతనంతో కూడిన సెలవు



**అక్షరటుడే, ఇందూరు:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ఈనెల 11న జరుగనున్న నేపథ్యంలో సోమవారం ప్రకటన విడుదల చేశారు. బోధన్, చందూర్, కోటగిరి, మోస్రా, పోతంగల్, రెంజల్, రుద్రూర్, సాలూర, వర్ని, ఎడపల్లి, నవీపేట మండలాల్లో మొదటి దశ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మొదటి దశ ఎన్నికలు నిర్వహించనున్న అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు, పరిశ్రమలకు వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రైవేట్ వ్యాపార, వాణిజ్య సంస్థల యాజమాన్యాలు వారి వద్ద పని చేసే ఉద్యోగులు, సిబ్బందికి ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన వెసులుబాటు కల్పిస్తూ అనుమతివ్వాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాలుగా వినియోగిస్తున్న విద్యాసంస్థలకు, ప్రభుత్వసంస్థలకు ఈనెల 10, 11వ తేదీల్లో రెండు రోజుల పాటు సెలవు దినాలుగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు.



## ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టాలి: కలెక్టర్

**అక్షరటుడే, కామారెడ్డి:** ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. దోమకొండ మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కౌంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో మూడు దశల్లో ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఎన్నికలకు సంబంధించి మండలాల వారీగా మొత్తం 2,361ఫారం 14 పత్రాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 152 పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు స్వీకరించామన్నారు. మొదటి దశలో మొత్తం 10 మండలాలలో 1,714 ఫామ్-14 అప్లికేషన్లు పంపిణీ చేశామని, రెండవ విడత జరిగే 7 మండలాలలో 322, మూడవ విడతలో జరిగే 8 మండలాలలో 325 ఫామ్-14 అప్లికేషన్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి అధికారి ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటర్ పరిశీలన అనంతరం ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రతి అధికారి తన బాధ్యతను నిబద్ధతతో న్యాయం, పారదర్శకత, శాంతి భద్రతలతో నిర్వహించాలని స్పష్టం చేశారు. మొదటి విడత పోలింగ్ ఈనెల 11న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని, అనంతరం ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. డీఎల్పీవో శ్రీనివాస్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, శిక్షణ నిర్వాహకులు నర్సింలు పాల్గొన్నారు.



## దివ్యాంగుల కోసం ఆటలపోటీలు

**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్:** మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. దివ్యాంగులకు ఆట పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో దివ్యాంగులను వేరుచేసి చూడవద్దని పేర్కొన్నారు. అలాగే ప్రతి సోమవారం భవిత సెంటర్లో ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నామని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను భవిత సెంటర్‌కు తీసుకొచ్చి సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీవో చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం కమల, ఫిజియోథెరపిస్ట్ కమల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## జోరుగా కొనసాగుతున్న ప్రచారం

**అక్షరటుడే, కోటగిరి :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కోటగిరి మండలంలో మంగళవారంతో ప్రచారాలు ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో పోటీలో ఉన్న అభ్యర్థులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కోటగిరి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో జోరుగా ప్రచారం సాగుతోంది. అభ్యర్థులు ఇంటింటికి తిరుగుతూ ముమ్మరంగా ప్రచారం సాగిస్తున్నారు. సర్పంచ్ బరిలో ఉన్న అభ్యర్థి పుప్పల సాయిలు తనకు కేటాయించిన బ్యాట్ గుర్తును చూపుతూ జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఓటర్లు తమ అమూల్యమైన ఓట్లను బ్యాట్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నారు. ప్రచారంలో సుదర్శన్, గణేష్, అప్పిరెడ్డి, కొండ రెడ్డి, గంగారాం, సంజు, లక్ష్మణ్, సాయికుమార్, శీను,పోచయ్య, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనధికార మ్యాప్‌తో వ్యాపారులను ఆగం చేయవద్దు

**అక్షరటుడే, కామారెడ్డి:** మున్సిపల్ అథారిటీ లేకుండా అనధికార మ్యాప్ చూపించి చిరు వ్యాపారులను ఆగం చేయవద్దని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. నూతన మడిగెలు పూర్తయ్యాకే వారిని తరలించాలని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ ఆనుకుని ఉన్న మడిగెలు ఖాళీ చేసే అంశంపై నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర రైల్వే మంత్రితో అమృత్ పథకం ద్వారా కామారెడ్డి రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయించి పనులు చేపడుతున్నామని శనివారం ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి పేర్కొన్నారన్నారు. అయితే రైల్వేస్టేషన్‌ను ఆనుకుని 90 నుంచి 100 మడిగెల్లో 40 ఏళ్లుగా పలువురు వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారని, మున్సిపాలిటీకి పన్ను ద్వారా లక్షల్లో ఆదాయం వస్తోందన్నారు. అలాంటి వ్యాపారులను వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని చెప్పడం సరికాదన్నారు. రైల్వే స్టేషన్ పనుల పరిశీలన సమయంలో ఎమ్మెల్యే ఒక మ్యాప్ చూపించారని, అది అధికారిక మ్యాప్ కాదని, ఎమ్మెల్యే సొంతంగా తయారు చేసిన మ్యాప్ అని తెలిపారు. ముందుగా మడిగెలు నిర్మించాలని చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సర్వే నంబర్ 6లో స్థలం స్వాధీనం చేసుకోవడానికి ఎమ్మెల్యేకు రెండేళ్లు పట్టిందని, ఇప్పటికైనా స్వాధీనం చేసుకున్నందుకు సంతోషమన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఉరుదొండ రవి, పంపరి శ్రీనివాస్, గడ్డమీది మహేష్, మామిండ్ల రమేష్, నిమ్మ విజయ్ కుమార్ రెడ్డి, జూలూరి సుధాకర్, చాట్ల వంశీకృష్ణ, సలీం, శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.





# పార్కింగ్ స్థలాలెక్కడ..?

- జిల్లా కేంద్రంలో విచ్చలవిడిగా వాహనాల పార్కింగ్
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- నో పార్కింగ్ పేరిట ఫైన్లు వేస్తున్న పోలీసులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు

**కామారెడ్డి పట్టణం జిల్లా కేంద్రంగా మారినా ఎక్కడి సమస్యలు అక్కడే అన్న చందంగా మారింది. ముఖ్యంగా వాహనాల పార్కింగ్ అతి పెద్ద సమస్యగా మారుతోంది. పార్కింగ్ స్థలాలను గుర్తించాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో 'నో పార్కింగ్' పేరిట పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. దాంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.**
**– అక్షరటుడే, కామారెడ్డి**

కామారెడ్డి పట్టణంలో వందలాది దుకాణాలు ఉన్నాయి. ప్రతి షాప్ కూడా రహదారికి అనుకునే ఉండటంతో వాహనాల పార్కింగ్ ఇబ్బందికరంగా మారుతోంది. నాలుగైదు వాహనాలు మాత్రమే పార్కింగ్ చేయాల్సిన స్థలంలో పదుల సంఖ్యలో పార్కింగ్ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆస్పత్రులు, బ్యాంకులు సైతం ప్రధాన రహదారుల పైనే ఉండటంతో విచ్చలవిడిగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### ఫైన్లు వేస్తున్న పోలీసులు

ట్రాఫిక్ సమస్య కట్టడికి పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుంది. పట్టణంలోని సుభాష్ రోడ్డులో నో పార్కింగ్ అని వాహనాలను నిలపకుండా చర్యలు తీసుకుంటున్నారు. అన్నిచోట్లా ఇలా ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కడపడితే అక్కడ వాహనాల పార్కింగ్ చేస్తున్నారు. రహదారి పైకి వాహనాలు కనిపించడంతో పోలీసులు ఫైన్లు వేస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు. ఓవైపు పార్కింగ్ స్థలాలు లేకపోవడం, మరోవైపు పోలీసులు వేస్తున్న ఫైన్లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


### ప్రధాన ప్రాంతాల్లో..

పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి రోడ్, సుభాష్ రోడ్, తిలక్ రోడ్, స్టేషన్ రోడ్, పాత బస్టాండ్, సిరిసిల్ల రోడ్లలో రోడ్లకు పక్కనే దుకాణాలు ఉన్నాయి. దాంతో వివిధ అవసరాల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజలు రోడ్ల పైనే వాహనాలు పార్క్ చేస్తున్నారు. దాంతో పట్టణంలో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. ముఖ్యంగా పాత బస్టాండ్, సుభాష్ రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అయితే వాహనాల రాకపోకలకు అనుగుణంగా పట్టణంలో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. జిల్లా కేంద్రమై ఎనిమిదేళ్లు గడుస్తున్నా ఇప్పటికి పటిష్టమైన ప్రణాళిక తయారు చేయడంలో మున్సిపల్ యంత్రాంగం విఫలమైందన్న ఆరోపణలు ఉన్నాయి.. పోలీస్ శాఖ, మున్సి పల్ సమన్వయంతో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయలేకపోతున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా భారీగా జరిమానాలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### త్వరలో పార్కింగ్ స్థలాల గుర్తింపు

పట్టణంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటికి కొన్ని చోట్ల గుర్తించాం. మరికొన్ని చోట్ల గుర్తించాల్సి ఉంది. త్వరలోనే అవసరమైన చోట, స్థలం అనువుగా ఉన్న ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తాం.
**– రాజేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్**







## ఘనంగా ఆక్స్‌ఫర్డ్ పాఠశాల వార్షికోత్సవం

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మీనాక్షి కన్వెన్షన్‌లో ఆక్స్‌ఫర్డ్ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చిట్ల ఆరతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల వ్యక్తిత్వ నిర్మాణంలో తల్లిదండ్రులదే ప్రధాన పాత్ర ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పిల్లలు చెప్పేది తల్లిదండ్రులు పూర్తిగా విని వారిని అర్థం చేసుకొని ప్రతిస్పందిస్తే సానుకూల ఫలితాలు వస్తాయని ఆమె స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులు, సమాజం భాగస్వామ్యం ఉంటుందని ఆమె అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు విలువలు నేర్పించాలని వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఆమె ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన ఇక్ఫాయ్ డీమ్డ్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ మట్ట అంజన్న మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే భట్టి విధానానికి స్వస్తి చెప్పి కాన్సెప్ట్ అర్థం చేసుకుని పరీక్షలు రాసే విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం ఒలింపియాడ్ పరీక్షల్లో జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు, పాఠశాలలో వంద శాతం హాజరు ఉన్నటువంటి విద్యార్థులకు, క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్లు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ పాఠశాలల అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రావు, పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్, పాలనాధికారిణి పద్మ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్లు అప్పగింత



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను తిరిగి బాధితులకు అప్పగించినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. రైల్వే స్టేషన్ ఆవరణలోని తన కార్యాలయంలో సోమవారం బాధితులకు ఫోన్లను అప్పగించారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు తమకు ఫిర్యాదు చేయగా ప్రత్యేక పోర్టల్ ద్వారా ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఫోన్లు రికవరీ చేసిన సిబ్బంది సుప్రియ, సురేందర్, గురుదాస్, సలావుద్దీను ఎస్సై అభినందించారు.



## ఆపదలో రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అమూల్యం

**అక్షరటుడే, ఇందూరు:** అనారోగ్య, అత్యవసర పరిస్థితుల్లో రెడ్‌క్రాస్ సేవలు అమూల్యమైనవని రెడ్‌క్రాస్ సొసైటీ ప్యాట్రన్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో పలు జిల్లాల ఛైర్మన్లు, రాష్ట్ర పాలకవర్గ సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పాలక వర్గానికి ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కోశాధికారులు నియామకాలపై సీఎంతో చర్చించి రాష్ట్ర గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లేందుకు తక్షణం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ.వి. శ్రీనివాస్ రావు, తోట రాజశేఖర్, కె. ప్రసాద్ రావు, జనార్దన్ పాల్గొన్నారు.




## కొమ్మనపల్లి సర్పంచ్ బరిలో మామ అల్లుళ్ల సవాల్..

**అక్షరటుడే, బోధన్:** పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్ అభ్యర్థుల ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పలు చిత్ర విచిత్రాలు సైతం ప్రజలకు చూసే అవకాశం కలుగుతోంది. సాలూర మండలం కొమ్మనపల్లి గ్రామంలో సర్పంచ్ పదవి కోసం సొంత మేనమామపై మేనల్లుడు పోటీకి దిగారు. మామాఅల్లుళ్ల సర్పంచ్ పదవి కోసం పోటీలో దిగడంతో పోటీ రసవత్తరంగా సాగుతోంది. శ్రీనివాస్ రెడ్డి అతని మేనల్లుడైన మహేందర్ రెడ్డిలు సర్పంచ్ కోసం పోటీ పడుతున్నారు. మామ శ్రీనివాస్ రెడ్డి 2013 నుంచి 2018 వరకు గ్రామ సర్పంచ్ గా పనిచేశారు. అదేవిధంగా రెండు పర్యాయాలు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. ఈసారి జనరల్ రావడంతో శ్రీనివాస్ రెడ్డి పోటీకి నిలబడగా అతడి మేనల్లుడు మహేందర్ రెడ్డి కూడా బరిలో దిగారు. మహేందర్ రెడ్డికి ఎటువంటి రాజకీయ నేపథ్యం లేదు. అయితే ఉన్నత చదువులు చదివిన మహేందర్ రెడ్డి గ్రామంలోనే స్థిరపడి వ్యవసాయం చేసుకుంటున్నాడు. అందరితో సత్సంబంధాలు ఉన్నాయి. దీంతో మామా అల్లుళ్ల పోరులో ఎవరు గెలుస్తారోనని గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు.

## నగరంలో పోలీసుల విస్తృత తనిఖీలు.. డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని ఏమాత్రం ఉపేక్షించడం లేదు. గత వారంలో రోజులుగా పోలీసులు నిర్వహించిన పలు డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో 150కి పైగా కేసులు నమోదు చేసినట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు.

### నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో..

నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఆర్మూర్, నిజామాబాద్, బోధన్ డివిజన్లలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రధాన ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్ టెస్టులు చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా 150మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.వారిని కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రూ. 13, 32,000 జరిమానాలు విధించారని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. 21 మందికి వారంరోజుల పాటు జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని సీపీ వెల్లడించారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దన్నారు.

## పరిహారం కోసం టవర్ ఎక్కిన బాధితుడు

**అక్షరటుడే, కోటగిరి:** గత వర్షాకాలంలో గోడకూలిన ఘటన తనకు నష్ట పరిహారం అందకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఎలక్ట్రికల్ టవర్ ఎక్కాడు. ఈ ఘటన కోటగిరి మండలం పోతంగల్ గ్రామంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతంగల్ గ్రామంలో ఇందురు సాయిలు తన భార్యపిల్లలతో నివాసముండేవాడు. అయితే గత వర్షాకాలంలో భారీ వర్షానికి ఇంటిపక్కన ఉన్న గోడకూలి తన భార్య, కూతురు మృతి చెందారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. ఆ సమయంలో ఇంటిపక్కవారు సాయిలుకు నష్టపరిహారం ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఇవ్వలేదు. దీంతో మనస్తాపానికి గురైన సాయిలు సోమవారం ఉదయం గ్రామ శివారులోని ఎలక్ట్రికల్ టవర్ ఎక్కి విద్యుత్ వైర్లు పట్టుకుని చనిపోతానని భీష్మించుకు కూర్చున్నాడు. గమనించిన స్థానికులు వెంటనే ఎస్సై సునీల్‌కు సమాచారం అందించారు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు, అతడి కుల పెద్ద మనుషులతో మాట్లాడించారు. న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని చెప్పి సాయిలును కిందికి దించారు.

